sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే



హైదరాబాద్ | 17-09-2026 గురువారం | సంపుటి-02 సంచిక : 153 EDITOR: ROHINI

ఎవడబ్బ సొమ్మని?

లక్ష కోట్ల భూ దోపిడీలో బీఆర్ఎస్ నేతలు

- కేసీఆర్ కుటుంబ భూబాగోతం బట్టబయలు
- వేల కోట్ల సొమ్ము కాజేసి తెలంగాణపై పెత్తనం
- అసెంబ్లీ వేదికగా గర్జించిన సీఎం రేవంత్ రెడ్డి
- గులాబీ నాయకుల భూబాగోతంపై బిగ్ బ్లాస్ట్
- 30 రోజుల్లో విచారణకు సిట్ ఏర్పాటు

కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ కట్టుకథల బండారం బద్దలైంది. రేవంత్ దెబ్బకు గులాబీ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి! వేల ఎకరాల ఆక్రమణల పునాదులు కదులుతున్నాయి. 30 రోజుల సిట్ దెబ్బకు బీఆర్ఎస్ బడా నేతల చుట్టూ ఉరితాళ్లు బిగుస్తున్నాయి. తెలంగాణ అమరవీరుల త్యాగాలను అపహాస్యం చేశారు. బుధవారం శాసనసభలో తెలంగాణ రాజకీయాలలో ఒక్కసారిగా భూకంపం వచ్చింది. నిన్నటిదాకా సెక్షన్ 22 ఏ భూముల పేరుతో ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని చూసిన ప్రతిపక్షానికి అసెంబ్లీ సాక్షిగా పెద్ద షాక్ తగిలింది. పదేళ్ల పాటు అధికారాన్ని అడ్డం పెట్టుకుని కేసీఆర్ కుటుంబం, బీఆర్ఎస్ కీలక నేతలు ఎన్ని వేల ఎకరాలు వెనకేశారో అధికారిక లెక్కలతో సహా బయటపెట్టారు సీఎం రేవంత్ రెడ్డి. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వెనుక దాగి ఉన్న ఆస్తులను స్వాధీనం చేసుకుని దళిత బిడ్డలకు పంచుతామంటూ విసిరిన సవాల్ రాష్ట్రంలో పెను సంచలనం సృష్టిస్తోంది.

- సహనం వందే, హైదరాబాద్

మలిదశ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరుల కుటుంబాలు, భూములు కోల్పోయిన పేదలు ఒకవైపు ఉంటే... కేసీఆర్ మాత్రం వేల కోట్ల విలువైన ఆస్తులను ఎలా సంపాదించారో రేవంత్ రెడ్డి ఎండగట్టారు. సిద్దిపేట జిల్లా పరిధిలో కేసీఆర్, ఆయన సతీమణి పేరిట 65 ఎకరాలు, కేటీఆర్ పేరు మీద 49 ఎకరాలు, శైలిమా పేరిట 17, అలేఖ్య పేరు మీద 9, చివరికి కేటీఆర్ కుమారుడు హిమాన్ష్ పేరు మీద 46 ఎకరాల భూమి ఉందన్నారు. కవిత పేరిట 14 ఎకరాలు, అనిల్ పేరిట 23 ఎకరాలు ఉన్నాయి. జోగినపల్లి రవీందర్ రావు పేరు మీద 53 ఎకరాలు, సంతోష్ కుమార్ పేరిట 18, ఆయన భార్య పేరిట 7, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రావు పేరిట 97 ఎకరాలు ఉన్నాయి. కేవలం అధికారిక రికార్డుల్లోనే కేసీఆర్ కుటుంబం, బంధువుల పేరిట 439 ఎకరాల భూమి ఉందని తెలిపారు.

ఎర్రవల్లి కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణ...

ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్ రికార్డుల్లో 123 ఎకరాలు చూపిస్తున్నప్పటికీ, అక్కడ 325 సర్వే నంబర్ పరిధిలోని 388 ఎకరాలకు ఎలాంటి చట్టబద్ధమైన ఆధారాలు లేవని తేల్చి చెప్పారు. ఈ భూములపై 30 రోజుల్లో సమగ్ర విచారణ పూర్తి చేయాలని అధికారులకు డెడ్‌లైన్ విధించారు. స్వాధీనం చేసుకోబోయే ఆ 388 ఎకరాలను దళిత కుటుంబాలకు పంచుతామని హామీ ఇచ్చారు.

కేటీఆర్ చేతుల్లోకి రామలింగరాజు ఆస్తులు

సత్యం రామలింగరాజు ఆస్తులు కేటీఆర్ బంధువుల చేతుల్లోకి ఎలా మారాయో, జన్వాడ ఫామ్‌హౌస్ వెనుక ఏం జరిగిందో సీఎం బయటపెట్టారు. అలాగే రంగనాయక సాగర్ వద్ద రైతుల నుంచి తక్కువ ధరలకు భూములు గుంజుకుని హరీష్ రావు 14 ఎకరాలు సొంతం చేసుకున్నారని, ఆ భూమికి రాకపోకల కోసం రూ. 5 కోట్లతో రోడ్డు వేయించుకున్నారని ఆరోపించారు. ధరణి పోర్టల్‌ను వాడుకుని ఆయన బంధువుల పేర్లపై 120 ఎకరాలు బదిలీ చేశారన్నారు.

మై హోమ్ సంస్థకు 2,400 ఎకరాలు...

మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, దయాకర్ రావు, గంగుల కమలాకర్, సుధీర్ రెడ్డిలు అసైన్డ్, భూదాన్ భూములను ఆక్రమించారని తెలిపారు. వట్టినాగులపల్లిలో వినోద్ రావు సోదరుడు, పల్లా రాజేశ్వర్ రెడ్డి భూదాన్ భూములను అక్రమంగా మార్చుకున్నారన్నారు.

సిరిసిల్లలో కేటీఆర్ బంధువులకు 8,000 ఎకరాలు, మై హోమ్ సంస్థకు 2,400 ఎకరాల భూమిని కేటాయించడంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని, పదేళ్లలో దాదాపు లక్ష కోట్ల భూ దోపిడీ జరిగిందని విమర్శించారు.

భూ కుంభకోణాలపై సిట్...

ఈ భూ కుంభకోణాలపై విచారణకు ప్రత్యేక విచారణ బృందం (సిట్) ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం ప్రకటించారు. టీజీఐఐసీ భూముల దోపిడీని బడ్జెట్ సమావేశాల్లో సాక్ష్యాధారాలతో బయటపెడతానని, 'నమస్తే తెలంగాణ' ఆస్తులు, గోల్డ్ స్టోన్ ప్రసాద్ ఇచ్చిన కార్ల వ్యవహారాన్ని బహిర్గతం చేస్తామని హెచ్చరించారు.

రేవంత్ రెడ్డికి హరీష్ రావు సవాల్...

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల పేరు మీద ఏకంగా 308 ఎకరాల భూములున్నాయని, దీనికి సంబంధించి తమ వద్ద పక్కా ఆధారాలున్నాయని బీఆర్ఎస్ నేత హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. సీఎం రేవంత్ భూముల సమీపం నుంచే రీజినల్ రింగ్ రోడ్డు అలైన్మెంట్, అలాగే బుల్లెట్ ట్రెయిన్ అలైన్మెంట్ వెళ్లేలా ప్లాన్లు రూపొందించుకున్నారని అన్నారు. "నిజంగా రేవంత్ రెడ్డికి నైతికత ఉంటే... రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టాక ఈ మూడేళ్లలో ఆయన సంపాదించిన ఆస్తులతోపాటు, మా ఆస్తులు.. ధరణి-భూభారతిలో జరిగిన వ్యవహారాల మీద సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా?" అని సవాల్ విసిరారు.

ఎస్‌బీఐలో రెండున్నర కోట్ల జీతంతో జాబ్స్

బ్యాంకింగ్ రంగం చరిత్రలోనే భారీ ప్యాకేజ్

- సైబర్ సెక్యూరిటీ ఆఫీసర్ పోస్టుకు ఈ ఆఫర్
- ఐటీ, కంప్యూటర్ సైన్స్ ఇంజనీర్లకు అవకాశం
- ఈనెల 24వ తేదీ దరఖాస్తుకు తుది గడువు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో ఉద్యోగం సాధించడం అనేకమంది కల. అయితే ఒక ప్రభుత్వ బ్యాంకులో సంవత్సరానికి ఏకంగా రెండున్నర కోట్ల రూపాయల వరకు జీతం ఆఫర్ చేస్తున్నారంటే మీరు నమ్ముతారా? అవును, మీరు విన్నది నిజమే. ఎస్‌బీఐ చరిత్రలోనే అత్యధిక ప్యాకేజీలతో సీనియర్ పొజిషన్స్ భర్తీ చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ వివరాలు ఇప్పుడు చూద్దాం.

- సహనం వందే, హైదరాబాద్

చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ తో పాటు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, డీన్ వంటి అత్యున్నత స్థాయి పోస్టుల భర్తీకి ఎస్‌బీఐ గ్రూప్ ప్రకటన విడుదల చేసింది. బ్యాంకింగ్ రంగంలో మారుతున్న సాంకేతికత, సైబర్ సెక్యూరిటీ సవాళ్లను ఎదుర్కొనేందుకు ఎస్‌బీఐ ఈ నియామకాలను చేపడుతోంది. ఈ పోస్టుల్లో అత్యంత ప్రధానమైన గ్రూప్ సీనియర్ సైబర్ సెక్యూరిటీ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థికి ఏకంగా రెండున్నర కోట్ల రూపాయల వార్షిక వేతనాన్ని అందించనున్నారు. అంటే నెలకు దాదాపు 20 లక్షల రూపాయలకు పైగానే జీతం లభిస్తుంది. ఈ పోస్టుకి ఎంపికైన అభ్యర్థులు ముంబై కేంద్రంగా పనిచేయాల్సి ఉంటుంది.

15 నుండి 20 ఏళ్ల అనుభవం...

అభ్యర్థులకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో కనీసం 15 నుండి 20 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం తప్పనిసరిగా ఉండాలి. వయోపరిమితి 2026 ఆగస్టు 31 నాటికి 57 సంవత్సరాలు లేదా అంతకంటే తక్కువ వయస్సు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. కనీసం యాభై శాతం మార్కులతో బీటెక్ పూర్తి చేసి ఉండాలి. కంప్యూటర్ సైన్స్, ఐటీ, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, సైబర్ సెక్యూరిటీ లేదా ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ వంటి విభాగాలలో డిగ్రీ ఉన్నవారు అర్హులు. వీటితో పాటు ఎంసీఏ, ఎంటెక్ లేదా ఎంఎస్సీ పూర్తి చేసిన అభ్యర్థులు కూడా ఈ పోస్టులకు పోటీ పడవచ్చు.

మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్... డీన్ పోస్టులు

ఈ గ్రూప్ చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ పోస్టుతో పాటు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, డీన్ వంటి మరిన్ని సీనియర్ స్థాయి పోస్టులను కూడా భర్తీ చేస్తోంది. బ్యాంకింగ్ నెట్‌వర్క్ విస్తరణ, విద్యా నిర్వహణ విభాగాల్లో సమర్థవంతమైన వారిని నియమించుకోవడమే ఎస్‌బీఐ ప్రధాన లక్ష్యం. ఈ పోస్టులకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన తర్వాత షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులను నేరుగా ఇంటర్వ్యూకు పిలుస్తారు. ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగానే తుది ఎంపిక ఉంటుంది.

ప్రారంభమైన దరఖాస్తు ప్రక్రియ...

దరఖాస్తు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఈ నెల 24 వరకు ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. గడువు ముగియడానికి ఇంకా కొద్ది రోజులు మాత్రమే సమయం ఉన్నందున అర్హులైన నిపుణులు త్వరగా అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించడం మంచిది. పూర్తి వివరాల కోసం ఎస్‌బీఐ అధికారిక కెరీర్స్ పోర్టల్ లో చెక్ చేసుకోవచ్చు.

ఆన్‌లైన్ మోసాలను అరికట్టడమే లక్ష్యం...

ఈ నోటిఫికేషన్ ద్వారా మనకు అర్థమయ్యేది ఏంటంటే... ఐటీ, సైబర్ సెక్యూరిటీ రంగాలకు బ్యాంకింగ్ సెక్టార్ లో ఎంతటి డిమాండ్ ఉందో తెలుస్తోంది. డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ మోసాలను నివారించడం బ్యాంక్‌లకు సవాలుగా మారింది. అందుకే కార్పొరేట్ కంపెనీలకు పోటీగా ఎస్‌బీఐ కూడా కోట్ల రూపాయల భారీ ప్యాకేజీలు ఇవ్వడానికి ముందుకు వస్తోంది. నైపుణ్యం, అనుభవం ఉంటే ప్రభుత్వ రంగంలోనూ భారీ అవకాశాలు ఉంటాయని ఈ నోటిఫికేషన్ నిరూపిస్తోంది.

కత్తినా కైఫ్... ఫిగర్ జూట్

కత్రీనా కైఫ్ బొద్దుగా మారడంపై ట్రోలింగ్

- మాతృత్వంపై సోషల్ మీడియా నరకం
- బిపాసా బసు, ఐశ్వర్యరాయ్ పైనా కూతలు
- సమీరారెడ్డి డిప్రెషన్... బయటకు రాలేని స్థితి
- సౌందర్యపు సంకెళ్ళు... మాతృత్వ గాయాలు

ఒక నటి రెండు దశాబ్దాల పాటు కష్టపడి స్టార్‌డమ్ తెచ్చుకున్నా... 350 కోట్ల రూపాయల సామ్రాజ్యం నిర్మించినా... బిడ్డకు జన్మనిచ్చాక మాత్రం సోషల్ మీడియాకు అవేవీ కనిపించవు! వారి కళ్లకు కనిపించేదల్లా పాట్ట ఎంత పెరిగింది, ముఖంలో మెరుపు తగ్గిందా అని మాత్రమే. 'బాల్టీ' సినిమాలో ఒక డైలాగ్ ఉంటుంది... అదేంటంటే, 'మహిళగా ఉండటం అత్యంత కష్టమైన పని' అని. బాలీవుడ్ భామల పరిస్థితి చూస్తుంటే అది నిజమేననిపిస్తుంది!

- సహనం వందే, ముంబై

ఇటీవల అంబానీ ఇంట్లో జరిగిన వినాయక చవితి వేడుకలకు కత్రీనా కైఫ్ తన భర్త విక్కీ కౌశల్‌తో కలసి వచ్చింది. బాబు పుట్టిన తర్వాత ఆమె బయట కనిపించడం ఇదే తొలిసారి. ప్రసవం తర్వాత ఎంతో ప్రశాంతంగా కనిపించిన ఆమెను చూసి మెచ్చుకుంటారనుకుంటే సీన్ రివర్స్ అయింది. నెటిజన్లు ఆమె ముఖం, శరీరాన్ని జూమ్ చేసి చూస్తూ విపరీతంగా ట్రోలింగ్ మొదలుపెట్టారు. కాస్త లావైందని... కెరీర్ అయిపోయిందంటూ తీర్పులు చెప్పేశారు. కత్రీనా ఒకవైపు 'కే బ్యూటీ' బ్రాండ్ ద్వారా 350 కోట్ల రూపాయల బిజినెస్ రన్ చేస్తూ అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చుకుంటోంది. కానీ ఈ ఘనతలేవీ సోషల్ మీడియా పండితులకు పట్టలేదు. తొమ్మిది నెలలు ఒక ప్రాణాన్ని మోసి జన్మనిచ్చిన తల్లి శరీరం మారడం సహజం. కానీ ఈ కనీస స్పృహ లేకుండా ఆన్‌లైన్‌లో జడ్జిమెంట్లు పాస్ చేయడం ఒక రోతగా మారింది.

బిపాసా బసు... సమీరారెడ్డిలకూ తిప్పలు

ఫిట్‌నెస్‌కు మారుపేరుగా నిలిచే బిపాసా బసు కూడా ఇలాంటి వేధింపులనే ఎదుర్కొంది. తన కుమార్తె దేవి జన్మించిన తర్వాత ఎదుర్కొన్న బాడీ షేమింగ్ గురించి ఓ ఇంటర్వ్యూలో తెగ బాధపడింది. నలభై ఏళ్ల వయస్సులో బిడ్డకు జన్మనిచ్చినప్పుడు, మ్యాజిక్ జరిగినట్లు ఇరవై ఏళ్లనాటి శరీరాకృతిని ఎలా సాధిస్తారని ఆమె ప్రశ్నించింది. సమీరా రెడ్డి అనుభవం మరింత దారుణమైనది. ప్రసవం తర్వాత ఏకంగా 105 కిలోల బరువు పెరగడంతో తీవ్రమైన డిప్రెషన్‌లోకి వెళ్ళిపోయింది. సమాజం నుంచి వచ్చిన నెగెటివిటీ, సొంత మనుషుల మాటల కారణంగా ఇంట్లోంచి బయటకు రావడానికి కూడా భయపడింది.

ఐశ్వర్య రాయ్ బరువు పైన కూడా...

ఈ రకమైన వేధింపులు ఇప్పటివి కావు. ఒకప్పుడు ప్రపంచ సుందరి ఐశ్వర్య రాయ్ బచ్చన్ కూడా దీనికి బలయ్యారు. ఆరాధ్య జన్మించిన ఆరు నెలల తర్వాత కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు వెళ్లినప్పుడు, ఐశ్వర్య బరువుపై ప్రపంచవ్యాప్తంగా విశ్లేషణలు చేశారు. ఆ సమయంలో అభిషేక్ బచ్చన్ జోక్యం చేసుకుని, తన భార్య ఒక 'సూపర్ మామ్' అని గట్టిగా సమాధానం చెప్పాల్సి వచ్చింది. ప్రసవం తర్వాత ఒక మహిళ కోలుకోవడానికి నిర్దిష్ట సమయం అంటూ ఏదీ ఉండదు. కానీ సోషల్ మీడియాలో పాత ఫోటోలను, ఇప్పటి ఫోటోలను పక్కపక్కనే పెట్టి మీమ్స్ చేయడం ట్రెండ్‌గా మారింది. దీనివల్ల పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్‌లో ఉన్న మహిళలు మరింత మానసిక కుంగుబాటుకు గురవుతున్నారు.

సమాజంలో విష సంస్కృతి...

సెలబ్రిటీలను చూసి సమాజం సాధారణ గృహిణులపై కూడా అలాంటి అంచనాలనే రుద్దుతోంది. కాన్పు కాగానే వెంటనే సన్నబడిపోవాలని ఒత్తిడి తెస్తున్నారు. ఈ విషసంస్కృతి సమాజంలో ప్రతీ ఇంటినీ ప్రభావితం చేస్తోంది. ఒక ప్రాణానికి జన్మనిచ్చే ప్రక్రియలో స్త్రీ శరీరం అనేక మార్పులకు లోనవుతుంది. ఆ మార్పులను గౌరవించడం నేర్చుకోవాలి కానీ, విమర్శలకు సాధనంగా మార్చకూడదు. మహిళలు అంటే కేవలం కనిపించే బాహ్య సౌందర్యం మాత్రమే కాదు. వారి శ్రమ, సాధించిన విజయాలు, ఒక తల్లిగా వారు పడే వేదన అంతకంటే గొప్పవి.